ఓం శ్రీసాయిరాం

దీక్షితులు ఇప్పుడే చెప్పియున్నాడు. ఇది పవిత్రమైన దినం. బ్రహ్మోపదేశం పొందిన 35మంది బాలకులకే కాదు సనాతన ధర్మమునకే ఇది పవిత్రదినం. సనాతన ధర్మ ఉద్ధరణమునందు ఇక్కడ జరిగిన ఉపనయనములకు ప్రాముఖ్యమున్నది. విద్యావ్యాసంగమునందు వేదాధ్యయమునకు అత్యున్నత స్థానం. ఎందుకంటే దాని ద్వారా మృత్యువును జయించవచ్చును. ఇతర విద్యల మూలంగా జీవనోపాధిని సంపాదించవచ్చు. మీరు ఉంటున్న పరిసరాల గురించి తెలుసుకోవచ్చు. డబ్బు సంపాదించటం ఖర్చుపెట్టటం నేర్చుకోవచ్చు. కొన్ని మెలుకువలు నేర్చుకోటం ద్వారా బాధలను తప్పించుకోటం, సుఖాలు పొందటం గ్రహించవచ్చు. జననమరణాలు లేని శాశ్వతానందరాజ్యం చేరే దారి వేదాలు చూపగలవు. ప్రజలు చైనా, అమెరికా, రష్యా దేశాల గురించి, ఫసిఫిక్ మహాసముద్రపు అగ్నిపర్వతాలను గురించి, ఆర్కిటిక్ ప్రాంతాల గురించి అన్ని వివరాలూ తెలుసుకుంటారు. తమ లోపలున్న రాజ్యాలను గురించి లేశంకూడా తెలుసుకోలేరు.

ప్రతి మనిషిలో ఐదు కోశములున్నవి. భౌతిక ఆవరణమైన అన్నమయకోశము గురించి మనుష్యులకు కొంచెం తెలుసు. దాన్ని గురించికూడా పూర్తిగా తెలియదు. మీకు తెలియకుండా అంతరాంతరాలలో ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములున్నవి. అన్నమయకోశము గురించి మాత్రమే తెలుసుకున్నవారు కామస్వరూపులు కాగలరేగాని రామస్వరూపులుకారు. అంటే కోరికల గాలి ఎటువైపు తోలితే అటు పోతూ వుంటారు. తమ కోరికలను అదుపులో పెట్టలేరు. తమలో దాగి వున్న దివ్యత్వం ఆదేశించిన విధంగా ఉత్తమ గుణాలు అలవరచుకోలేరు. తమ లోపల వున్న సీమలను కనుగొని స్వాధీనంచేసుకోటానికి తగిన ప్రోత్సాహమూ, నిర్దశమూ వేదాలనుంచీ, వేదాలాలలోని సత్యాలను వివరించే శాస్త్రాలనుంచీ పొందవచ్చును.

వేదాలలో అత్యధిక భాగం కర్మకాండ. పవిత్ర కార్యాల ద్వారా వృక్షం పుష్పించి, ఫలాలు పెద్దవి అవుతాయి. కనుక, కర్మకాండకు ఎక్కువ బాహుళ్యం. ఉపాసనాకాండ ఆ ఫలాలు పరిపక్వం అయ్యే విధానం సూచిస్తుంది. జ్ఞానకాండ ఆ ఫలాలు మాధుర్యం నింపుకునే పద్ధతిని తెలుపుతుంది. మొదటి దశ తక్కిన వాటికంటే దీర్ఘమైనది కాబట్టి దానికి ఎక్కువ భాగం వినియోగించారు. దీనితో పోల్చినప్పుడు రెండు మూడు దశలు త్వరితంగా కనబడుతవి. అందువల్ల వేదాలలో అవి తక్కువ భాగాన్ని ఆక్రమిస్తున్నవి. మూడవ దశలో ఫలం వృక్షంనుంచి విడిపడికూడా వెచ్చని గడ్డిలో కాని, మూసిన గదిలోగాని కాపువేయటం ద్వారా మాధుర్యం సంతరించుకోగలదు. మానవుడు సత్సంగం వల్ల జ్ఞామనే మాధుర్యం పొందగలడు. ఏకాంత ప్రదేశములో ధ్యానం చేయటం వల్ల తనంతట తాను ఆ మధురిమను సంపాదించుకోగలడు. కాని, ఏ పద్ధతిని అవలంబించినప్పటికీ, ఆ మాధుర్యం బయటనుంచి లోపలికి ప్రవేశపెట్టలేము. అది లోపలినుంచి పెంపొందవలసినదే. లోపలి శత్రువులతో పోరాడి జయించటం వల్ల మన అంతస్సులో పరివర్తనం రావాలి.

దీన్ని గురించి కొంచెంసేపు భావన చేయండి. మీ నిజతత్త్వమైన దివ్యత్వము గ్రహించటానికే మీరు శరీరమనే ఉపాధి ధరించి వచ్చారు. మీ కోరికలతో, ఆలోచనలతో మీరే శరీరమనే ఈ గూడుచుట్టూ అల్లుకున్నారు. రెక్కలు వచ్చి ఎగిరిపోయే నేర్పు కలిగే వరకు ఈ గూటినే ఉపయోగించుకోవాలి. ఈ లోకంలోకి ఎవరో బలవంతాన నెట్టివేశారనే విచారంతో పుట్టినప్పుడు ఏడుస్తూ ఇక్కడకు వచ్చారు మీరు. అలా విచారం ఎందుకు కలిగింది? భగవంతునితో అనుబంధం సడలిపోయిందనే విచారం. దుఃఖిస్తూ ఇక్కడికి వచ్చి ఆ దుఃఖంలో ఇక్కడినుండి వెళ్ళరాదని మీరు నిశ్చయించుకోవాలి. ఈ జీవిత కాలంలోనే ఆ విచారాన్ని విదిలించి వేయండి.

రామాయణంలో శోకరసం వెల్లివిరుస్తున్నదని ఒకాయన చెప్పాడు. ఈ పురాణంలో శోకమే ప్రధాన రసం, నిజమే. శోకమే, వేదనే ప్రార్థనకు ప్రథమ సోపానం. భగవంతుని సన్నిధికి చేర్చగల శక్తిలో భయం కంటే బాధ గొప్పది. జారిపోయిన అవకాశాలకోసం, వ్యర్థంగా గడచిపోయిన కాలంకోసం బాధపడుతూ గమ్యస్థానంవైపు సాగిపొండి. అర్థంలేని రాగద్వేషాలలో నిరర్థకమైన ఆర్జనావ్యయాలలో, నష్టాలలో, నిర్వేదాలలో గాలిమేడలు కడుతూ, పడగొడుతూ ఉండటంలో మీకు క్షణమైనా శాంతి చిక్కటంలేదు. మీ గది ఎయిర్‌కండిషన్ చేయవచ్చు. సోఫాలు మెత్తగా అమర్చవచ్చు. అయినప్పటికీ మీకు మనశ్శాంతి దొరకకపోవచ్చు. మీకు బ్యాంకులోనున్న ధనంమీదా, మీరు సంపాదించుకున్న డిగ్రీలమీదా మనశ్శాంతి ఆధారపడదు. మీలో ఉన్న దానవతకు దాసులు కారాదు. మీలోపలి దివ్యత్వం వికసించి ప్రకటన పొందటానికి అనువుగా నడుచుకోవాలి. అప్పుడే మీకు మనశ్శాంతి చిక్కుతుంది. లోపలి దానవత్వమే అసురిక శక్తులను ప్రేరేపిస్తుంది. వీటిని గురించి గీతలో చెప్పారు. వీటిని సుబ్రహ్మణ్య దీక్షితులు వివరించాడు. విశ్వంలో ప్రతి పదార్థం దివ్యం. అస్తి, భాతి, ప్రియం అనే మూడు లక్షణాలతో ప్రతీదీ శోభిస్తున్నది. సచ్చిదానంద సమన్వితం, విశ్వవ్యాప్తమై శాశ్వతమై కేవలమై అలరారే పదార్థమూ మనం చూచే పదార్థమూ ఒకటే. సచ్చిదానందం రెండింటిలోనూ సమానంగా ఉన్న లక్షణం.

ఈ సత్యమే వటువులు నేడు మంత్రోపదేశము అందుకున్నారు. ఉప-నయనం అంటే దగ్గరకు చేర్చటం. వటువును ఉపదేశం చేయగల గురువు దగ్గరకు చేర్చటం. ఈ మంత్రోపదేశం చేయగల గురువు నామరూపాలకు అతీతమైనవాడుగా, ప్రాపంచిక ఆశలను ఆశయాలనూ దాటిన వాడుగా, భిన్నంగాతోచే పదార్థాలలో ఏకమైన పరమార్థమును గుర్తించినవాడుగా ఉండాలి. అటువంటి

గురువులు బల్లలు కట్టుకొని తమ గొప్పతనం చాటుకోరు. ఘనతకోసము, ప్రతిఫలంకోసమూ ఇతరులతో పోటీపడరు.

ఈ బాలకుల అదృష్టం విశిష్టం. అది ఎంత గొప్పదో వాళ్ళకే తెలియదు. ఉపనయనాలు ఇక్కడ జరగడం గొప్ప విశేషం. ఇది వారి జీవితాల్లో పరివర్తన కలిగిస్తుంది. ఏ పూర్వజన్మలోనో తెలిసి చేసిన సత్కర్మల ఫలాన్ని తెలియకుండా ఇప్పుడు అనుభవిస్తున్నారు. గురువు కొత్త విషయాలేమీ బోధించడు. మిమ్ములను మీరు తెలుసుకొనుటకు తోడ్పడగలడు. మీ హృదయ దర్పణం నిర్మలం చేసుకొని అందులో మలినము, వంకరలూ లేకుండా మీ నిజస్వరూపం చక్కగా ప్రతిఫలించేటట్లు చేయగలడు. బ్రహ్మచారి గురువుగారి ఆదేశాన్ని సంకోచం లేకుండా తూచా తప్పకుండా అనుసరించాలి. సంజీవనీ పర్వతం మోసుకు వెడుతున్నప్పుడు ఆంజనేయుడు ఆకాశమార్గంలో నందిగ్రామం మీదుగా ఎగిరిపోతుండగా పౌరులు చూచారు. కొండను మోసుకుపోతున్న వింత దృశ్యం భరతుడు చూచాడు. ఆ కోతిని క్రిందికి రప్పించి సంగతి తెలుసుకున్నాడు. యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపోయినట్లూ ఆయనకు స్పృహ తెప్పించే మూలిక ఆ పర్వతం మీద ఉన్నట్లూ విన్నాడు. ఒక బాణ ప్రయోగంచేసి ఆ పర్వతం శీఘ్రంగా రాముని సన్నిధికి చేరుకునేటట్లు చేస్తానంటాడు భరతుడు. ఆరితేరిన విలుకాడు వేసిన బాణం కంటే తానే త్వరగా పోగలనంటాడు ఆంజనేయుడు. సత్యం గ్రహించేటందుకు మీ శక్తులను సంపూర్ణంగా వినియోగించండి. మీ స్వశక్తిపైన, మీ స్వీయసామర్థ్య నైపుణ్యాలపైన ఆధారపడండి. మీ అవసరం మేరకు అవి పెరుగును. అప్పుడే మీకు అంత్యమగు ఆనందము.

ఈ బాలకులలో చాలామంది వేదపాఠశాలలో చేరినారు. మరి కొందరు చేరబోతున్నారు. అధ్యయన సాధనలో ఒకరినుంచి ఒకరు ప్రోత్సాహం పొందగలరు. పదిమంది స్నేహితులు వచ్చి, 'రండి రండి పోదాం' అంటే మీకూ ఉత్సాహం కలుగుతుంది. వారి వెంట మీరూ వెడతారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అడుగడుగునా మీరు అలవరుచుకునే సద్గుణసంపదకు దోహదంచేస్తూ ఉంటారు. నేను మీ హృదయాలలో లేతమొక్క నాటుతాను. వారు దానికి ఎరువు వేసి నీరు పోస్తారు. వారు మీ దగ్గర లేనప్పుడు నేనుకూడా అప్పుడప్పుడు నీరు పోస్తాను. తామర వాడకుండా ఉండాలంటే కొలను నిండా నీరుండాలి. హృదయ సరోవరం ప్రేమజలంతో నిండాలి. ద్వేషం వల్ల ఆ చెఱువు ఎండిపోతుంది. ఆత్మవిశ్వాసం అలవరుచుకోండి. అదే మంచి మందు. ఇతరులపట్ల సమభావంతో సేవచేయాలి. అదే సరియైన పథ్యం.

మీ అందరికీ నేను చెప్పేది ఏమంటే, 'పర్వతాలు కూలవచ్చు, సముద్రము పొంగి భూమినంతా ముంచివేయవచ్చు. అయినా, మీ సాధన మీరు మానవద్దు. మీలో నిజాయతీ వృద్ధికాకపోతే సాధన వ్యర్థం. మీరు అన్నీ విడిచిపెట్టి భగవంతునికి సమర్పించుకుంటే ఆయన మిమ్ము రక్షించి దారి చూపగలడు. 'నన్ను భగవంతుడు రక్షించ లేదు' అని మీరు అంటే, 'మీరు భగవంతునికి అన్నీ సమర్పించుకోలేదు' అని నేను అంటాను. భక్తరక్షణ కోసమే భగవంతుడు అవతారం ధరించాడు. భక్తరక్షణ చేసి తీరుతానని భగవంతుడే ప్రకటిస్తూ ఉన్నాడు.

నిజానికి మీరందరూ శరణాగతి గురించి మాటలు చెబుతారేగాని ఎన్నో విషయాలను మీ స్వాధీనంలో అట్టిబెట్టుకుంటారు. ప్రభుని చరణాల దగ్గర అన్నీ సమర్పణ చేయరు. ఒక చెట్టు కొమ్మమీదనుంచి ఇంకోదానిమీదికి దిగుతూ గంతులువేసే కోతులు మీ మనస్సులు. వాటిని నాకు వశంచేయండి. నేను వాటిని స్థిరంగా, భద్రంగా మార్చగలను. అవి నేను కూర్చోమంటే కూర్చుంటాయి. నిలబడమంటే నిలబడతాయి. అందుకే శంకరాచార్యులు తన మనస్సు అనే కోతిని పరమశివునికి స్వాధీనంచేస్తానన్నారు. శివుడే ఆ కోతిని మచ్చిక చేసుకొని దానిని తనకు నచ్చిన విధంగా ఆటలాడించగలడు. మీ అధీనంలో ఏమీ మిగుల్చుకోకుండా ఉన్నదంతా భగవంతునికి అర్పణ చేసినప్పుడే ఆవిధంగా జరుగుతుంది.